క్లుప్తంగా

నేడు ఏరియా వైద్యశాల భవన ప్రారంభోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రూ. 7 కోట్ల ఆర్ఐడీఎఫ్ గ్రాంటుతో 100 పడకల ఏరియా హాస్పిటల్ భవన అప్‌గ్రేడేషన్ ప్రారంభోత్సవాన్ని ఆదివారం 12.30 గంటలకు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు శనివారం తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కన్నా లక్ష్మీనారాయణ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి

సత్తెనపల్లి: ప్రజలంతా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. ఆనంద్‌కుమార్ శనివారం కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగుస్తోందని చెప్పారు. ఈలోగా పన్నులు చెల్లించని పక్షంలో ఇంటి కుళాయి కనెక్షన్ తొలగించడంతో పాటు సెక్షన్ 130 రూల్ 30 (2) కింద కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో, మీ-సేవాలో, సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా, పురమిత్ర యాప్ ద్వారా చెల్లించాలని కోరారు. ఆదివారంతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఏవో శాంతికి సత్కారం

పెదకూరపాడు: నకిలీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందిచేందుకు కృషి చేసిన మండల వ్యవసాయశాఖాధికారి ఇంజం శాంతిని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సత్కరించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో లాట్ నంబర్ 303కు చెందిన 9211 రకం నకిలీ మిర్చి విత్తనాలను కొనుగోలు చేసి 100ఎకరాలు రైతులు పూత, పిందె రాకపోవడంతో నష్టపోయారు. దీన్ని గుర్తించి ఏవో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. లాంఫారం శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించి నాణ్యత లేమిగా గుర్తించారు. దీంతో రైతులు తమకు న్యాయం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో చర్చించి రైతులకు పరిహారం ఇచ్చేలా శాంతి కృషి చేశారు. నష్టపోయిన రైతులకు ప్యాకెట్‌కు రూ.2వేలతో పాటు నాణ్యత కలిగిన ప్యాకెట్‌ను పరిహారంగా అందించారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు శాంతి సేవలను కొనియాడారు. ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ చాంద్ బాషా, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, అభ్యుదయ రైతు దర్శి శేషారావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 20 వరకు సాగునీరు విడుదల చేయాలి



ముప్పాళ్ల: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటలు చేతికందాలంటే ఏప్రిల్ 20వరకు నీటిని విడుదల చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆయకట్టు పరిధిలో జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారని తెలిపారు.దిగుబడులు ఇంటికి రావాలంటే తప్పనిసరిగా ఏప్రిల్ 20వరకు నీటి సరఫరా అవసరమని, లేనిపక్షంలో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ నెలాఖరుకు నీటిసరఫరాను నిలివేయకుండా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమణారెడ్డి, పొలురాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల మధ్యగల కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శుక్రవారం రాత్రి ప్రభ ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం అన్నదానాన్ని నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ప్రధాన రహదారిలో దుకాణాల ఏర్పాటుతో సందడి నెలకొంది. సాయంత్రం బండ ఎత్తు పందేలు, మోకు లాగు పోటీలు, మహిళలకు కుర్చీల ఆటలను నిర్వహించారు. కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గోపాల్ నాయక్, కమిటీ సభ్యులు బాలాజీనాయక్, గురుస్వామి, ముసుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు బర్డ్‌ఫ్లూ దెబ్బ

- అమాంతంగా పడిపోయిన ధర
- నేటికీ ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- నష్టపోతామంటున్న రైతన్నలు
- సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో 2,696 హెక్టార్లలో సాగు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతుల కష్టాలు మరింత పెరిగాయి. వాతావరణ పరిస్థితులను తట్టుకొని పంటలు పండించినా అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధర అందడం లేదు. దళారులు చెప్పిన రేటుకే దిగుబడులను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది పంటలు సాగు చేసిన రైతులు నష్టాల బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.



మొక్కజొన్న పంట

ముప్పాళ్ల: ఆరుగాలం కష్టించి సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికందగానే ధర అమాంతం పడిపోయింది. బర్డ్‌ఫ్లూ కారణంగా ధరలు పతనమవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మాగాణి సాగు గిట్టుబాటు కాకపోవడంతో గత ఐదేళ్లుగా మొక్కజొన్న సాగుపై మక్కువ చూపుతున్నారు. ఆశించిన మేర దిగుబడులతో పాటుగా మద్దతు ధర లభిస్తుండటంతో సాగు లాభదాయకంగా మారింది. అదే ఆశతో ఈ ఏడాది కూడా సాగుకు శ్రీకారం చుట్టారు. అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 2,696 హెక్టార్లలో వేశారు. మొక్కజొన్నను ఎక్కువగా కోళ్ల మేతకు వినియోగిస్తారు. ఈ ఏడాది బర్డ్‌ఫ్లూ రావటంతో ధరపై ప్రభావం పడింది. పంట బాగా పండి గిగుబడి వచ్చినా రేటు ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది.

అమాంతం పడిపోయిన ధర

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ల, పెదకూరపాడు, రాజుపాలెం, నకరికల్లు మండలాల పరిధిలో సుమారు 2,696 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. ప్రారంభంలో మంచి ధర పలికినా రోజు రోజుకి క్రమంగా తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రారంభంలో క్వింటా మొక్కజొన్న రూ. 2,800 ఉంది. బర్డ్‌ఫ్లూ వచ్చిన తర్వాత క్వింటా రూ.2,200కి పడిపోయింది. మొక్కజొన్నను ఎక్కువగా కర్ణాటక, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన కోళ్లఫారం నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. సుమారు రెండువేల టన్నుల పైగా కొనుగోలు చేసి లారీల ద్వారా తరలిస్తుంటారు. బర్డ్‌ఫ్లూతో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో కొత్తగా పిల్లల పెంపకాన్ని నిలిపివేశారు. దీంతో మొక్కజొన్న కొనుగోలు తగ్గించడంతో రేటు పతనమైందని వ్యాపారులు చెబుతున్నారు.



మొక్కజొన్నలు ఆరబెడుతున్న మహిళా రైతు

ఖర్చులు పోను మిగిలేది అంతంతే !

ఎకరం పొలంలో మొక్కజొన్న పండించేందుకు రైతుకు దాదాపు రూ.35 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరానికి 35క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టుబడి పోను రైతుకు రూ.28వేలు మాత్రమే మిగులుతోంది. ఇంజన్‌లతో నీరు తోడి తడలు పెట్టే రైతులకు అంత కూడా మిగిలే పరిస్థితి లేదు. ప్రభుత్వ పరంగా మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశాలు లేకపోవడంతో రైతులు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్నారు.

మొహం చాటేసిన ప్రభుత్వం

పంటకు మద్దతు ధర లేక అల్లాడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు కనపించడం లేదు. ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు లేవు. గత వైఎస్సార్ సీపీ హయాంలో పంట చేతికందే సమయానికి గిట్టుబాటు ధర అందకపోతే వెంటనే చర్యలు తీసుకునేవారు. ఆ గ్రామంలోనే రైతుభరోసా కేంద్రాలలో కొనుగోలు కేంద్రాల ద్వారా పంట దిగుబడులను కొనుగోలు చేసేవారు. నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేసేవారు. పంటలు చేతికంది అమ్మకాలు జరుగుతున్నా నేటికీ కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తడం లేదు. ఎక్కడా కొనుగోలు కేంద్రాలు పెట్టిన దాఖలాలు లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి పంటలను అమ్ముకొని నష్టపోవాల్సిన పరిస్థితి రైతన్నది.

గిట్టుబాటు కాని సాగు



ఎకరంలో మొక్కజొన్న సాగుకు రూ.35వేలు పెట్టుబడి పెట్టా. కౌలు రూ.10వేలు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్ముకుందామంటే క్వింటా రూ.2,150కి అడుగుతున్నారు. అన్నీ ఖర్చులు పోను కొంచెమే మిగులుతోంది. అధిక ఆదాయం రాకపోయినా ఎప్పటి నుంచో పండిస్తున్నందుకు సాగు చేయక తప్పడం లేదు.

–చిగుళ్ల సత్యనారాయణ, చాగంటివారిపాలెం

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. విత్తనాలు, ఎరువులు ధరలు పెరిగాయి. ఎకరానికి రూ.38వేల వరకు ఖర్చయింది. చివర్లో కాల్వలకు నీరు నిలిచిపోవడంతో ఇంజన్‌తో పెట్టుకోవాల్సి వచ్చింది. పంట చేతికొచ్చే సమయానికి ధర లేకుండా పోయింది. ప్రభుత్వమే మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి

–బత్తుల కొండలు, చాగంటివారిపాలెం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



పంట చేతికి రాగానే మార్కెట్లో ధర పడిపోయింది. 2.5 ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. ఎకరాకు రు.40వేల వరకు పెట్టుబడి పెట్టా. కోతకు వచ్చే సరికి బర్డ్‌ఫ్లూ అని చెప్పి ధర తగ్గించేస్తున్నారు. గ్రామాల్లో దళారులదే ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

–గోవిందు శ్రీనివాసరెడ్డి, నార్నెపాడు

గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

గ్రామాల్లో పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. శనగ రైతుల నమోదు జరుగుతోంది. మొక్కజొన్న కూడా క్వింటా రూ.2,225 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. రైతులు పేర్లను ఆయా రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి.

–ఎం.అరుణ, మండల వ్యవసాయాధికారి, ముప్పాళ్ల

కోగంటివారిపాలెంలో చెత్తకు మోక్షం



సాక్షి ఎఫెక్ట్

అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెంలో అంతర్గత రోడ్ల పక్కన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఆవుల గోపీచంద్ చేపట్టారు. సాక్షిలో 'కానరాని స్వచ్ఛత...జాడలేని సంపద' శీర్షికన శనివారం ప్రచురితమైన ప్రత్యేక కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. గ్రామంలో ఇప్పటి వరకు రోడ్ల పక్కన, పొలాలకు వెళ్లే దారుల వెంట, కృష్ణానదికి వెళ్లే దారి వెంట పడేసిన చెత్తను తొలగించారు. అయితే గ్రామంలో నిర్మించిన డంపింగ్ యార్డు కోర్టు వివాదంలో ఉండటంతో చెత్త మొత్తాన్ని ఊరుబయట ఉన్న చెరువు కట్ట పక్కకు తరలించినట్లు పంచాయతీ కార్యదర్శి గోపీచంద్ చెప్పారు.పంచాయతీకి ప్రత్యేకంగా కార్మికులు లేనందున కూలీలను నియమించి ఊరు బయటకు తరలించామని తెలిపారు. డంపింగ్ యార్డు స్థల వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున వినియోగించలేక పోతున్నామని చెప్పారు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

నకరికల్లు: బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడి అసువులు బాసిన కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ సంస్మరణ సభను స్థానిక భగత్‌సింగ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించనున్నట్లు పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి శనివారం తెలిపారు. ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నిర్వాహకులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు, శివపార్వతి



చెట్టుకు ఢీకొని దెబ్బతిన్న కారు

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దిరికీ తీవ్ర గాయాలయ్యాయి. పెదకూరపాడు రామాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి వెంకటేశ్వరరావు బంధువులైన మరో ముగ్గురితో గుంటూరు నుంచి అమరావతికి కారులో వస్తున్నారు. మండల పరిధిలోని ఎండ్రాయి శివారులోని కోళ్ల ఫారాల వద్ద ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బండ్లమూడి వెంకటేశ్వరరావవుకు, దొడ్డపనేని శివపార్వతికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు బాధితులను బయటకు తీసి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి నప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు.

గ్రామ గ్రామాన నీటి కుంటల తవ్వకం

అచ్చంపేట: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి కుంటల తవ్వకపు పనులను గ్రామ గ్రామాన శనివారం ప్రారంభించినట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని కస్తల, అచ్చంపేట, చిగురుపాడు, నీలేశ్వరపాలెం, కొత్తపల్లి తదితర గ్రామాలలో తవ్వకం చేపట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఎం సీహెచ్. వెంకటేశ్వర్లు, జూనియర్ ఇంజనీర్ బి.రమణమూర్తి, టెక్నికల్ అసిస్టెంటు రాజవర్ధన్ శేషారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నీటి కుంటల నిర్మాణానికి భూమి పూజ

సత్తెనపల్లి: సేద్యపు నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ పీవీ నారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం కంటిపూడిలో కారసాల శ్రీనివాసరావుకు చెందిన పొలంలో శనివారం సేద్యపు నీటి కుంటల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీ నారాయణ మాట్లాడుతూ మండలానికి 300 సేద్యపు నీటి కుంటలను లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అర్హత గల చిన్న, సన్న కారు రైతులను గుర్తించి వారి వద్ద నుంచి సంబంధిత పత్రాలను తీసుకొని పరిపాలన ఆమోదం కోసం పంపనున్నట్లు చెప్పారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా తవ్వకం

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరులో శనివారం సేద్యపు నీటికుంటకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సర్పంచి తాళ్లూరి శ్రీనివాసరావు పొలంలో కుంటను తీయనున్నట్లు చెప్పారు. రైతులు ముందుకొస్తే ఉపాధి హామీ ద్వారా ఉచితంగా తీస్తారని, స్వయంగా చేసుకున్నా కూలి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వరరావు ,గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లూరి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు వాసిరెడ్డి వెంకట్రావు, చావా మురళి, దిగుమర్తి వెంకటగిరి, చావా నాగేశ్వరరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.



అందుకూరులో భూమి పూజ

రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని అన్ని గ్రామాల్లో సేద్యపు కుంటల నిర్మాణ పనులను శనివారం తొండపి, బొల్లవరం గ్రామాల్లో ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు నీటి అవసరాల కోసం పొలాల్లో కుంటలు నిర్మించుకోవచ్చని ఏపీడీ పి.వి.వెంకటనారాయణ చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఏడుకొండలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండం పెట్టి చెబుతున్నా....

సహకరించడం లేదు !

- సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సర్పంచి ఆవేదన
- సర్పంచులపై అధికారులు చిన్నచూపు
- సహకరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మీరయ్య

పెదకూరపాడు: ''దండం పెట్టి చెబుతున్నా... మా సర్పంచులకు మండలంలోని అధికారులు సహకరించడం లేదు.... కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదు... గ్రామ ప్రథమ పౌరులను చిన్నచూపు చూస్తున్నారు'' అంటూ మండల సర్పంచుల తరఫున పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు మండల సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం అంటే కొందరు అధికారులు నిర్లక్షంగా ఉంటున్నారని, కీలకశాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారని, సహకరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం అంటూ తెలిపారు. శనివారం పెదకూరపాడులోని సమావేశ మందిరంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

సర్పంచులకు అవమానం

సర్వసభ్య సమావేశం ఆహ్వాన పత్రికలో సర్పంచ్‌ను ప్రస్తావించక పోవడంపై సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుతో 20 మంది సర్పంచులకు గానూ తొమ్మిది మంది మాత్రమే హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం ఇస్తున్నట్లు నోటీసుల్లో పేర్కొని, సర్పంచులను ప్రస్తావించకపోవంతో అవమానంగా భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆ శాఖల అధికారులు ఎక్కడ ?

సాగునీరు లేక మిర్చి, మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో సమావేశానికి ఇరిగేషన్ శాఖ సిబ్బంది హాజరు కాకపోవడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్‌తో పాటు ఫైర్, ఎక్సైజ్, పశుసంవర్ధక, అటవీ, రెవెన్యూ, హార్టీకల్చర్, ఆర్ అండ్ బీ శాఖలు సమావేశానికి గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు నిలదీశారు.

పేరుకే పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైనా పేరుకే పెదకూరపాడు ఉందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇక్కడ ఉండాల్సిన శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యాలయం, పోలీసు సర్కిల్ కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం క్రోసూరులో ఉండటంపై ప్రజాప్రతినిధులు సమావేశంలో చర్చించారు. ప్రజలు అవసరాలకు క్రోసూరు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. పెదకూరపాడులోనే ముఖ్య కార్యాలయాలు ఉండేలా తీర్మానం చేయాలని కోరారు.

పరస్పర సహకారం అవసరం

ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేల బావులు, చెరువులో ఎప్పటికప్పుడు క్లోరింగ్ చేయాలని కోరారు.ఈ సందర్భంగా బ్లాక్ పంచాయితీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ)2025-26 ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు షేక్ చాంద్ బాషా, బాలమేరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు నీరు చాలా అవసరం

మాదల(ముప్పాళ్ల): మానవాళి మనుగడకు నీరు చాలా అవసరమని, సక్రమంగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫరూక్ చెప్పారు. మండలంలోని మాదలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఏపీబీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో నీటి వినియోగం పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏఈ ఫరూక్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పరిశ్రమలు తదితర కారణాలు ప్రపంచ నీటి వనరులను సంక్షోభ దిశగా నెట్టివేస్తున్నాయని తెలిపారు. భూగర్భ జలాలను సంరక్షించాలంటే నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతగా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు తల్లి పేరు మీద ఒక్కొక్కరూ మొక్క నాటాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసునీత, వైస్ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు త్రినాథ్, నిర్మల్‌రాజు, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకాలు



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నగేష్

సత్తెనపల్లి: ఉద్యాన పంటల సాగుకు పలు ప్రోత్సాహకాలు ఉన్నాయని, రైతులంతా ఉపయోగించుకోవాలని సత్తెనపల్లి ఉద్యాన శాఖ అధికారి డి.నవీన్ కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ పామాయిల్, వెదురు సాగు రాయితీలు గురించి రైతులకు వివరించారు. వెదురుకు ఎకరానికి రూ.24 వేలు, పామాయిల్‌కు ఎకరానికి రూ.15,200, అరటికి ఎకరానికి రూ.15 వేలు రాయితీ వస్తుందని తెలిపారు.

నేతి వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



నేతి వెంకన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు కొండపై నేతి వెంకన్నస్వామి నాలుగో శనివారం తిరుణాళ్లకు భక్తులు పోటెత్తారు. గోవింద నామస్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలంటూ నీరాజనాలు అందించారు. సమీప గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది వచ్చారు. స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు సమర్పించారు. పశు సంపదను కాపాడాలని స్వామికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. తిరునాళ్లలో రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు దాతలు అన్నదానాలు చేశారు. భక్తులకు తాగునీరు, మౌలిక వసతులు కల్పించినట్లు ఈవో సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే కన్నా

నేతి వెంకన్న స్వామిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజుపాలెంలో జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా పెదకూరపాడు ఎంఈవో కార్యాలయం



ఏళ్ల తరబడి ప్రమాదంగా ఉన్న రెవెన్యూ కార్యాలయం



పూర్తిగా శిథిలమైన పోలీసు క్వార్టర్లు

పాత భవనాలు.. ప్రమాదాలకు నిలయాలు

ఒకప్పుడు నిత్యం ప్రజలతో కళకళలాడిన ప్రభుత్వ భవనాలు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. పెదకూరపాడులోని ప్రధాన సెంటర్‌లో ఉన్న కచేరి సెంటర్, గ్రామ రెవెన్యూ కార్యాలయం, మండల విద్యావనరుల భవనం, పోలీసు క్వార్టర్లు, కాలచక్ర రహదారిలోని ఎస్సీ బాలికల వసతి గృహం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నిరుపయోగంగా ఉండి ప్రమాదంగా ఉన్న పాత భవనాలను కూల్చి వేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

– పెదకూరపాడు